628099001

జిహ్వాగ్రే వసతే లక్ష్మీ జిహ్వాగ్రే మిత్ర బాంధవాః
జిహ్వాగ్రే వందనం ప్రాప్తి జిహ్వాగ్రే మరణం ధ్రువమ్.

ప్రేమస్వరూపులారా!

మానవులకు లభ్యమయ్యే సంపదలన్నీ వాక్కు చేతనే కలుగుచున్నవి. మానవుడు పొందే స్నేహాన్ని, బంధుత్వము కూడను వాక్కువలనే చేరుచున్నది. మానవుని బంధములు వాక్కుచేతనే కలుగుచున్నవి. కడపటికి మరణము వాక్కుచేతనే సంభవించుచున్నది. మానవ జీవితములో వాక్కు చాలా ప్రధానమైనది. ప్రాణము వంటిది. వాక్కును పరిశుద్ధముగా వుంచుకున్నప్పుడు మానవుడు పవిత్రుడుగా మారతాడు. ఎట్టి సమయమునందైనా వాక్కును అతిజాగ్రత్తగా వుపయోగించుకోవాలి. ఇట్టి పవిత్రమైన వాక్కు సత్సంగము చేతనే లభ్యమవుతుంది.

సద్గుణంబులు లేక సచ్చింతనలు లేక
ధ్యానమందు మనసు నిలువగలదె
ఇల్లు కట్టుటకును ఇటుకలు సున్నంబు
కలుగకున్న యిల్లు కట్టుటెట్లు?

మానవ జీవితమే కాక సమస్త ప్రాణులు కూడను అరిషడ్వర్గముల చేత కప్పబడినవి. ఈ అరిషడ్వర్గములలో మొట్టమొదటివి కామ క్రోధములు. మానవునకు కామ క్రోధములని రెండు పదములుండినప్పటికీ మొదటి పదము యొక్క పరిణామమే రెండవ పదము. లోభ మోహ మద మత్సరములు కూడను మొదటి పదము యొక్క పరిణామమే. అరిషడ్వర్గములనగా కామము యొక్క పరిణామము. కామము యొక్క పరివర్తనే వీటి యొక్క స్వరూప స్వభావములకు మూలకారణము. కామము వలన అపేక్ష పెరుగుచున్నది. ఈ అపేక్ష విషయ సంబంధమైన అపేక్షగా రూపొందుచున్నది. ఈ అపేక్షనే ఫలించకుండిన అనగా విఫలమైన క్రోధముగా మారుచున్నది. ఈ క్రోధమే సమ్మోహనంగా తిరుగుచున్నది. ఈ సమ్మోహనమే కట్టకడపటికి పెరిగి పెరిగి స్మృతి భ్రష్టుని గావించుచున్నది. ఈ స్మృతి భ్రష్టునకు కష్టము వల్ల బుద్ధి క్షీణించుచున్నది. ఈ బుద్ధి నాశనము వలన సర్వము నాశన మగుచున్నది. సర్వ దుఃఖములకు, సర్వనాశనములకు, సర్వ అపకీర్తులకు కామమే మూలకారణము. సర్వాంభలను తగినంత అదుపులో వుంచుకొని తగిన రీతిగా మనము జీవించటానికి ప్రయత్నించాలి. ఈ నాడు నవరాత్రులను గురించిగాని లేక శివరాత్రులను గురించిగాని నేను చెప్పదలచుకో

లేదు. ఇంతవరకు ఎవ్వరికి తెలియనటువంటి విషయమును యీనాడు తెలియ చెప్పటానికి పూనుకున్నాను.

నైజాము రాష్ట్రములో మారుమూలనున్న కుగ్రామము పత్రి. ఈ పత్రి గ్రామములో గంగాభవాన్యుడు దేవగిరమ్మ అనే దంపతులు వుండేవారు. వారికి సంతానము లేక బాధపడుచుండేవారు. కాని ప్రార్థనా ఫలితమును పురస్కరించుకొని 1835 వ సంవత్సరము సెప్టెంబరు 28 వ తేదీ ఒక పుత్రుడు పుట్టాడు. అది [illegible] నాడే. ఆ పుట్టిన బిడ్డనే సాయిబాబా. కాని వారు మహా వైరాగ్యవంతులగుటచేత గంగాభవాన్యుడు యీ పుత్రునిపైనను చూడకుండ వదలి వైరాగ్యముతో అరణ్యమునకు ప్రయాణమయ్యాడు. పతినే దైవముగా భావించిన దేవగిరమ్మ ఆ పతినే అనుసరిస్తూ పోయింది.

ఐతే అదే గ్రామములో సూఫీ మతమునకు చెందిన ఒక ఫకీరు వుండేవాడు. ఆ ఫకీరు యీ పిల్లవానిని తీసుకొని పుత్రులు లేకపోవటం చేత పెంచుకుంటూ వచ్చాడు. ఈ ఫకీరు యింటిలో 1835 నుండి 1839 వరకూ వుండినాడు. నాలుగు సంవత్సరములు ఫకీరు యింటిలో వుండినాడు. ఐతే కాలకర్మ కారణ కర్తవ్యాలు కలిసి రావటం చేత ఫకీరు మరణించాడు. ఈ పిల్లవానిని ఎంతో ప్రేమతో సాకుతున్న యీ ఫకీరు భార్య కూడను చాలా విచారములో మునిగింది. దానికి తగినట్లుగా యీ పిల్లవాడు విరుద్ధమైన చేష్టలు చేస్తూ వచ్చాడు. ఆనాడు ఆ ప్రదేశములో హిందూ ముస్లిముల మత భేదములు హెచ్చి మీరిపోయాయి. అనేక రౌద్రములతో ఒకరినొకరు చెలరేగుచుండినారు. ఈ పిల్లవాడు హిందూ దేవాలయములోకి పోయి మహమ్మదుకు సంబంధించిన, అల్లాకు సంబంధించిన విషయాలంతా పాడుతుండేవాడు. 'మై అల్లాహూ' నేను భగవంతుడను. 'అల్లా మాలిక్ హై' అనగా భగవంతుడే ప్రభువు అని కేకలు వేసేవాడు. అందువల్ల హిందువులందరు యీ పిల్లవానిని అనేక రకములుగా శిక్షిస్తూ వచ్చారు. ఇంక మసీదులోకి వెళ్ళి 'రాముడే దేవుడు'. శివుడే అల్లా' యీ విధముగా చెప్పేవాడు. హిందువుల దేవాలయములకు వెళ్ళి మహమ్మదీయులగురించి చెప్పటం చాలా విరుద్ధముగా వుండేది. ఈ మతముల వారందరు యీ ఫకీరు భార్యదగ్గరకు వచ్చి కంప్లైంటు చేసేవారు. ఆమెకు సాధ్యము కాక ఫకీరు భార్య యీ పిల్లవానిని తీసుకొని అతి సమీపములో వుండిన పండితుడు, సాధు మహనీయుడు వెంకూసాదాస్ అనే ఆయనకు అప్పజెప్పింది. ఇక్కడ 1835 ను 1851 వరకు అనగా 12 సంవత్సరములు వెంకూసా ఆశ్రమములో వున్నాడు. వెంకూసా యీ పిల్లవానిని చాలా ప్రేమించేవాడు. ప్రతి ఒక్క విషయములో కూడను బాబాకు ప్రధాన స్థానము నందించాడు. ఈ విధముగా వుండగా ఆశ్రమములోని వారికి యీ పిల్లవానిపైన ద్వేషము ప్రారంభమైంది. అసూయ కలుగుతూ వచ్చింది. కాని ఒక నాటి రాత్రి 1851 సంవత్సరములో అనగా 12 సంవత్సరములైన తరువాత ఆశ్రమము వదలి ప్రయాణమయ్యాడు. షిరిడి చేరాడు. షిరిడి చాలా చిన్న గ్రామం. అక్కడ రెండు నెలలు మాత్రమే వుండి తదుపరి అక్కడ నుండి కూడను సంచారము జరుపుతూ పోయాడు. కొన్ని సంవత్సరములు తిరిగి తిరిగి ధూప్ ఖేడా అనే గ్రామము చేరాడు. ఆ గ్రామములో నివాసము చేస్తుండగా చాంద్ భాయి పటేలు

తమ్ముని వివాహము జరిగింది. ఆ పెండ్లి వారి గుంపుతో తిరిగి షిరిడీ వచ్చి చేరాడు. అప్పుడు 1858. దేశము తో చుట్టి షిరిడీ వచ్చాడు. అప్పటి నుండి 1918 వరకు షిరిడీని వదల లేదు. 60 సంవత్సరములు అక్కడే వున్నాడు. ఈ విధంగా అక్కడ వుండి వచ్చిన వారితో సంభాషణలు సల్పటం, వారి విచారములకు తగిన ధైర్యసాహసములు అందించటం, వారి కష్టములకు కొన్ని ఉపాయములు బోధించటము యీరకమైన చర్యలతో కాలము గడుపుతూ వచ్చాడు. క్రమక్రమేణా యీ బాబా సమాచారము ప్రపంచమంతా వ్యాపించిపోతూ వచ్చింది.

(2) ఈవిధముగా వుండగా బొంబాయి రాష్ట్రము లోపల డిప్యూటి కలక్టరు, సెటిల్మెంటు ఆఫీసర్ సాథే వుండే వాడు. H.V. సాథే అనగా హరి వినాయక్ సాథే. ఇతను భార్యావియోగముచేత బాధపడుతూ వుండినాడు ఈ విధముగా విచారముగా వుండినప్పుడు Prof. G.G. నార్కె అనే స్నేహితుడు వచ్చాడు. వచ్చి ధైర్యము చెప్పి దిగులు నీవు విచారించి యేమి ప్రయోజనం లేదు. కొంతకాలం స్థానం వదలి ఎక్కడికైనా మహనీయులను సందర్శిస్తే మంచిదని షిరిడీకి తీసుకువచ్చాడు. ఈ సాథే విషయం చెప్పాలంటే చాలా ఘనంగా వుంది. షిరిడీ వెళ్ళి బాబాను దర్శించాడు. కొన్ని సందర్భాలలో బాబా యితని వైపు చూస్తూ నవ్వుతూ చేతులు తిప్పుతూ అనేకరకములుగా ఆడుతూ వచ్చాడు. ఇతను నిజంగా మహనీయుడా లేక పిచ్చివాడా అనే భావములు అతనిలో చెలరేగుతూ వచ్చాయి. నేను ఎవ్వరో తన మిత్రుడు కూడా బాబాకు చెప్పలేదు. దర్శనం చేసుకొని నిల్చున్నారు. "సాథే ఫికర్ నకరో" నీవు విచారించవద్దు. దేహములు నీటి బుడగలు కదా! కనుక యిట్టి దేహముపైన నీవు భ్రాంతిని పెట్టుకోవద్దు అభివృద్ధి పరచుకోవద్దు. దైవ భ్రాంతిని అభివృద్ధి పరచుకో. విచారములు కదలిపోయే మేఘములు. ప్రతి వ్యక్తికి కూడా యిలాంటివి సంభవిస్తూనే వుంటాయి. ధైర్యమూ వహించు. బిడ్డను కాపాడుకో అన్నాడు. వాని భార్య బిడ్డను ప్రసవించి మరణించింది. పాపం ఆ బిడ్డ సంగతి తన మిత్రుడైన నార్కేకు కూడా తెలియదు. కాని యీ విషయాన్ని వినేటప్పటికి యితను పిచ్చివాడు కాదు త్రికాలజ్ఞాని అని విశ్వసించాడు. అప్పటికప్పుడు వెళ్ళి దర్శనం చేసుకుని రావాలనుకున్నవాడు తిరిగి 2 దినములు అధికంగా వుండవలసి వచ్చింది. ఈ విధంగా వస్తూ పోతూ భక్తులకు తగిన వసతులు లేవని తాను విశ్వసించి అక్కడ మొట్టమొదటి వసతిగృహమును నిర్మించాడు సాథే. దానినే యిప్పటికి కూడా సాథే వాడా అని పిలుస్తూ వుంటారు. ఈ విధంగా షిరిడీ లోపల మొట్టమొదటి గృహమును నిర్మించిన వాడు సాథే. క్రమక్రమేణా యితను సర్వీసు చేస్తూ చేస్తూ ఎవరికి నేను సంపాయించి యివ్వాలి? ధన కనక వస్తు వాహనాదులంతా కేవలం అనిత్యములని స్మరించుకుంటూ తిరిగి రెండవ పర్యాయము షిరిడీ వెళ్ళాడు. బాబా నవ్వుతూ సాథే నీవు ఉద్యోగంపైన విరక్తి పొందిన ట్లుగా వుంది. నీవు సంపాదించిన ధనం ఎవరికి యివ్వాలా అని విచారిస్తున్నావు. ఎవరికి యివ్వటం యేమిటి? మంచి కార్యములు చేయి. మన షిరిడీలో కోట కట్టు. స్వామి నేను లక్షాధికారిని కాదు కదా! ఇంత పెద్ద కోటను నేను ఎలా నిర్మించగలను అని ప్రార్థించాడు. చేతనైనంత వరకూ చేస్తూరా. నేనుండగా భయమెందుకు?

Why fear when I am here. ఈ విధమైన పలుకులు విని సాఠే చాలా ఆశ్చర్యం వహించాడు. క్రమక్రమేణా అతని మేన మామ దాదా కేల్కర్ కూడా వచ్చి యీ షిరిడిలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. ఇతను పూనా నుండి డబ్బు పంపటం వాని మేనమామ కట్టడాలు కట్టి అభివృద్ధి చేయటం యీ విధముగా కార్యక్రమములో మునుగుతూ వచ్చేరు. ఈ విధంగా సాఠేను మొట్టమొదట ఒక పనిముట్టుగా తీసుకున్నాడు బాబా. ఇంక అప్పటినుండి అన్ని కార్యములందు సాఠేను ప్రధానమైన వ్యక్తిగా భావిస్తూ వచ్చాడు. ఇక్కడ బాబా కూడా సాఠేను అతి సమీపముగా చేర్చుకుని ప్రతి పని కూడా సాఠేకు అందివ్వటం చేత షిరిడి లోని ప్రజలకు సాఠేపైన అసూయ కలుగుతూ వచ్చింది.

తాను చేయకున్న తగవు పుట్టదు గాని
పరులు చేయ జూచి ఓర్వలేరు
దాత దరిని చేరి తన సొమ్ము చెడినట్టి
జిహ్వలోడ చాడీలు చెప్పుచుండు.

అనేకమంది బాబా దగ్గర చేరి అనేక రకములుగా చాడీలు చెప్పుతూ వచ్చారు సాఠేపైన. 'ఇట్టి వారికే పేరు పెట్టవలయును?' చిన్నకులకు శత్రువు అని పేరు పెట్టవలయును' అన్నారు. ఏమిటి ఆ శత్రువు? కుక్కలు. చూశారా! ఇలాంటి చాడీలు చెప్పేవారు కుక్కలతో సమానమన్నారు.

ఇంక బాబా దగ్గర రెండు ప్రధానమైన పనులుండేవి. ఎవరు వచ్చినా ముందు డబ్బు తీసుకునేవారు. దక్షిణ. మరీ అధికంగా లేదు. ఐదు రూపాయలు, రెండు రూపాయలు, మూడు రూపాయలు యిలా తీసుకునే వాడు. ఇక్కడ తీసుకునేది యిక్కడ యిచ్చేది వాళ్ళ ఎదురుగానే. ఒక్కటీ తన దగ్గర వుంచుకునే వాడు కాదు. ఒకనాడు 'ప్రధాన్' అనే వ్యక్తి వచ్చాడు. అతను షిరిడి సాయి బాబాను యిరవై రూపాయలు యివ్వాలి అనుకున్నాడు. ఆనాడు ఐదు, రెండు, ఒక రూపాయి నోట్లు లేవు. అంతా చిల్లరగా వుండేవి. వెండి రూపాయలు చేక్కేవి. ఆనాటి వెండి తుత్తునాగము యిలాంటివి కాదు. యీనాడు coins అంతా అల్యూమినియంగా తయారైపోతున్నాయి. రాగి కూడా కాదు. ఆనాడు ఒక రూపాయి ఒక తులం వెండితో వుండేది. ఇంత చిల్లర ఎలా యిచ్చేది అనుకుని ఒక బంగారు నాణెము (సవర) తీసుకొని వెళ్లి యిచ్చాడు. దానిని యిటూ అటూ తిప్పి చూశాడు బాబా. 'ఏమి ఇది నేనెప్పుడు చూడలేదే' అన్నాడు. ప్రక్కన వున్నవాడు 'స్వామి యిది బంగారు నాణెము' అన్నాడు. ఇది నాకు అక్కర లేదు. నాకు రూపాయి యిచ్చేయి యిది నాకు అక్కర లేదు. దీనిని తీసుకో' అన్నాడు. ఈ coin ఎన్ని రూపాయలవుతుంది? అప్పుడు ఒక సవరకు 15 రూపాయలు అడిగి తీసుకుని 15 రూపాయలు యిచ్చారు. ఈ ప్రధాన్ 15 రూపాయలిచ్చేటప్పటికి బాబా 'ప్రధాన్ యింకా 5 రూపాయలు నాకు రావాలి' అన్నాడు. ఇతను ఆశ్చర్య… ఏమిటిరా? సవరకు 15 రూపాయలే. నేను కరెక్టుగా యిచ్చేనే. ఎందుకిలా అడుగుతున్నారు. యింకా 5 రూపాయలు

నావలంటున్నాడే. అధికంగా అడుగుతున్నాడే. అని వీరందరికి కొన్నికొన్ని అనుమానములు బయలుదేరాయి. మొదట 5 రూపాయ లిచ్చి తరువాత యోచన చేయి అన్నాడు బాబా. నీవు యింటి దగ్గర ఏమనుకుని వచ్చావు? 20 రూపాయలు యివ్వాలను కొని వచ్చావు. ఇప్పుడు 15 రూపాయలే యిచ్చావు. ఇంక 5 రూపాయలు నాకు రావాలి కదా! అది యివ్వమన్నాడు. దానితో యీ జడ్జీ యొక్క తల తిరిగిపోయింది. సాయిబాబా సరియైన జడ్జి. అనుకున్నాడు.

(3) ఈ విధంగా పోయిన వారిదగ్గరంతా డబ్బు తీసుకోటం అప్పటి కప్పుడే బీదవారికి యిచ్చేయుటం యీ విధముగా చేయుటం ఒక అలవాటు. ఒకనాడు కేల్కారును పిలచి ఈనాడు గురుపూర్ణిమ గురుపూజ చేయవున్నాడు. సాయి వేసిన మాటలో గురుపూజ మొట్టమొదట ప్రారంభింప చేశాడు. ఈ కేల్కారు గురుపూజ అంటే ఏమిటని ప్రశ్నించాడు. గురువంటే ఎవరను కున్నావు. కేవలం మఠాధిపతులు కారు గురువులు. సన్యాసులు కారు గురువులు. భగవంతుడే గురువు. 'బ్రహ్మానందం పరమ సుఖదం' లోకములో వున్న అన్ని ఆనందములలో ఉన్నత స్థానములో వున్నది 'బ్రహ్మానందం' అది ఒక్క బ్రహ్మకు తప్ప వేరొకరికి వుండదు. లోకములో వస్తు సంబంధమైన ధనకనక వస్తు వాహనాది సుఖములు తాత్కాలిక సుఖములే. 'పరమ సుఖదం' అనగా పరమాత్ముడే. 'కేవలం జ్ఞానమూర్తిం' ఏది జ్ఞానం? ఏమిటి జ్ఞానం? వస్తు జ్ఞానమా విషయ జ్ఞానమా? కాదు. కాదు. కేవలం జ్ఞానమూర్తిం. అద్వైత జ్ఞానం. రెండు కానటువంటి వస్తువే యీ జగత్తంతా వ్యాపించి వున్నది అనే విషయమే జ్ఞానము. అట్టి జ్ఞాన స్వరూపుడు భగవంతుడు. ద్వంద్వాతీతం అనగా రెండు కానటువంటిది. తత్వజ్ఞానము. ఏమిటి ఆ జ్ఞానము? 'అహం బ్రహ్మాస్మి'. ఇది వేద వాక్యము. 'ప్రజ్ఞానం బ్రహ్మ'. 'అయమాత్మ బ్రహ్మ'. 'తత్వమసి' 'సోహం' ఈ నాలుగు వాక్యములకు అతీతమైన తత్వమే యీ బ్రహ్మజ్ఞానం. ఈ విధంగా చూస్తూ గురువనగా కేవలం భగవంతుడొక్కడే. 'గురు బ్రహ్మ గురుర్విష్ణు, గురుదేవో మహేశ్వరః' బ్రహ్మ విష్ణు మహేశ్వరులే నిజమైన గురువులు. సృష్టి స్థితి లయకారులైన వారే గురువు. కనుక భగవంతుడే గురువు. కాబట్టి నేను విష్ణువును చెయ్యాలా లేక బ్రహ్మను చెయ్యాలా లేక రుద్రుని చెయ్యాలా ఏమి సెలవిస్తావని కోరాడు. కేల్కారు ఈ విధంగా అడిగేటప్పటికి అరే సైతాన్ వున్నాను కదా యిక్కడ చేయి అన్నారు. అనగా తానే బ్రహ్మవిష్ణు మహేశ్వర స్వరూపుడని. ఇలాంటి నేను నేనుగా వున్న తత్వాన్ని నీవు పూజించు అన్నాడు. దానితో షిరిడీలో చేరిన భక్తులందరు కూడను సాక్షాత్ పరమేశ్వరుడు షిరిడీ సాయిబాబా అని విశ్వసిస్తూ వచ్చారు. ఈ విధముగా కాలము గడుస్తూ రాగా షిరిడీలో వున్న వారందరు సాయిపైన ద్వేషమును సాధించటానికి ప్రయత్నించారు. దీనికి కారణమేమనగా వచ్చిన దక్షిణంతా ఒక హుండీ మాదిరి పెట్టి దానిని సంరక్షించుకొని తద్వారా భవనమును కట్టాలని సంకల్పించుకున్నాడు పాపం. దీనికి తగినట్లుగా పాపం సాయి దురదృష్టమనుకోవచ్చు. ఒక వెండి రథము వుండేది. యింక వెండిగుళ్లాలు కూడా వుండేవి. అవి దొంగలు ఎత్తుకుని పోయారు. ఆ టైప్పుకు సాయిప్రధాన

628099006

కర్త. ఇతను యేమో చేశాడని చాలా మంది యితని మీద కక్ష సాధిస్తూ వచ్చారు. ఒకనాడు ఒక వ్యక్తి ఒక గొడ్డలి తీసుకొని సాఠే ప్రయాణమయ్యే మార్గములో నిల్చుకొని వున్నాడు. ఈ దృశ్యమును వాని మామ చూచాడు. చూచి సాఠే నీవు యింక యిక్కడ వుండనక్కరలేదు. నీవు ఎక్కడైనా వుండి బాబాను స్మరిస్తూరా. నీవు తక్షణమే షిరిడీ వదలిపో' అని చెప్పాడు. అప్పుడు సాఠే షిరిడీని వదలలేక వదలలేక షిరిడీ వదలి వెళ్ళాడు. క్షణక్షణము కూడా బాబా సాఠే సాఠే సాఠే యీ విధంగా సాఠేను పిలుస్తూ వచ్చారు. కాని సాఠే లేడు. ఇది ఒక విచారంగా ప్రదర్శిస్తూ వచ్చాడు బాబా. సాఠే అతి ప్రియుడు బాబాకు. అతి సన్నిహితుడు. ఇలాంటి సన్నిహితుడైన సాఠేను పంపుటంచేత బాబా ఆనందంగా లేడని భక్తులలో ఒకరికొకరు మాట్లాడుకుంటూ వచ్చారు.

(4) ఈ సమయానికి తగినట్లుగా శ్యాం తల్లిదండ్రులు రిటైర్ అయిన తరువాత రెండుసంవత్సరముల పిల్లవానిని శ్యాం తీసుకుని షిరిడీకి వచ్చారు. మోహన్ శ్యాం అని అతని పేరు. మోహన్ మోహన్ అని తల్లిదండ్రులు పిలిచేవారు. బాబా కేవలం శ్యాంశ్యాం అని పిలిచేవాడు. ఈ పిల్లవాడు అక్కడే చదువుకొని తల్లిదండ్రులు రిటైరై వచ్చినందువల్ల అక్కడే షిరిడీలోనే సెటిల్ అయిపోయినారు. ఈ పిల్లవాడు షిరిడీలోనే చదువుతూ వచ్చాడు. క్రమక్రమేణా సాఠే పోయిన తరువాత శ్యాంను దగ్గరకు తీశాడు బాబా. కడపటికి శ్యాం చదివి చదివి టీచరు ట్రైనింగ్ చదివాడు. అక్కడే ఒక స్కూలు లోపల టీచరుగా నియమించబడ్డాడు. పగలంతా టీచ్ చేయటం. ప్రక్క రూంలో బాబా వుండటము. క్లాసు తైన తరువాత క్లాసు రూములోనే శ్యాం పండుకోటం. ఈ క్లాసు రూమ్ కు బాబా వున్న రూముకు మధ్యలో చిన్న వెంటిలేటరు వుండేది. రాత్రంతా యీ చిన్న రంధ్రము నుంచి బాబా రూములో చూస్తూ వుండేవాడు శ్యాం. బాబా తనలో తాను మాట్లాడుకోటం, తనలో తాను నవ్వుకోటం, తనలో తాను కోప్పడటం, తనలో తాను అనేక రకములైన చర్యలు చేస్తూ వుండటం చూస్తూ వుండేవాడు. అక్కడ బాబా పండుకునే పడక ఎలాంటిదంటే పైన రెండు తాళ్ళు కట్టారు. ఒక చిన్నర అడుగు చెక్క ఆ చెక్కపైనే పండుకొని వూగుతూ వుండేవాడు. అందుకే శ్యాంకు భయము. స్వామి నిద్రలో క్రింద పడిపోతారో యేమో చిన్న పలకనే అని దినము చూస్తూ వుండేవాడు. ఒకనాడు ధైర్యము చేసి బాబాపాదాలు వత్తుతూ వుండగా స్వామి రాత్రంతా మీరు నిద్రపోవటం లేదే ఏదో నవ్వుకుంటారు. మాట్లాడుకుంటారు. ఏమిటి దీని అంతరార్థము చెప్పమని ప్రార్థించాడు. 'పిచ్చివాడా! నీకొక్కడికేనా వుంటుందేది లోకములో ఎంతమంది వుంటున్నారు నా కోసం ప్రార్థిస్తూ వుండేవారు. వాళ్ళందరితోనూ మాట్లాడుతున్నాను అనేవారు. నా వేలు తిప్పటమంటే మనస్సు తిప్పటమే. వారితో మాట్లాడటమే నా పెదవులు చేసే పని. వారి యొక్క పిచ్చితనాన్ని చూచి నవ్వటమే నా పరదా. ఇవన్నీ భక్తులతో చేసే చర్యలే నాయనా అని సమాధానము చెప్పాడు. క్రమక్రమేణా యీ శ్యాం కోరుతూ వచ్చాడు. స్వామి! క్లాసులు తక్కువగానే వుంటున్నాయి. మీ సేవ పాదసేవను చేసుకుంటాను మిగిలిన కాలములో యిక్కడే వుండాలి అని ప్రార్థించాడు. అప్పుడు బాబాకు వండిపెట్టేది లక్ష్మీబాయి. స్వామి సేవ నేను

చెయ్యాలని లక్ష్మీబాయి దగ్గరకు పోయి రొట్టె చేయటము. ఏ రొట్టె. జొన్న రొట్టె. దాని లోపల బాబాకు చాలా ఇష్టమైనది వంకాయ. దానిని చేసే విధానం నేర్చుకోవాలని లక్ష్మీబాయి దగ్గరకు పోయేవాడు. ఈ విధంగా సేవ చేస్తూ వచ్చారు. ఈ సేవలో తాను పొందిన ఆనందము తనకు మాత్రమే తప్ప అన్యులకు తెలియదు.

(5) బాబాకు కోపము లేదు కానీ ప్రదర్శించేవాడు. కోపం వస్తే పది అడుగుల దూరము వుండి నా కట్టెను తీసుకొని వారిపై విసిరేవాడు. ఒక రోజు తిరిగి శ్యాం ప్రశ్నించాడు. స్వామీ! యింత కోపంతో వారిని కొడుతున్నావే వారికి ఏదైనా ప్రమాదం కలిగి ప్రాణం పోతే నీకు చాలా అపకీర్తి వస్తుంది కదా అని అడిగాడు. అరే! సైతాన్. బైకో ఆ ప్రాణం నా చేతిలో వుంటుందా? నేను పంపిస్తే కదా వాని ప్రాణం పోయేది. కాబట్టి నేను పోకుండా చూచుకుంటాను నీవు నీపని చెయ్యి అన్నాడు. నీ కెందుకు యీ విషయములో విచారము. ఈ రకమైన దృశ్యము నేను చూపినప్పుడే వాడు సరియైన స్థితికి వస్తాడు. మంచి మంచిగా పోతే నా తలపైన కూర్చుంటారు. కనుకనే పదముల చేతను, వాక్యముల చేతను కొంతవరకు వారిని బెదిరించి అదిలించి పని చేయించాలి. కార్యనిమిత్తమై నేను యింత చర్యలు చేస్తున్నాను గాని నాకు కోపం లేదు అని ఒక్క శ్యాంకు మాత్రమే లోపలున్న రహస్యాన్ని చెప్పాడు. కనుక బాబా చర్యలు కేవలము ప్రేమతత్వము తప్ప అన్యము కాదు. ఈ విధముగా శ్యాం ను నిరంతరము సమీపమునందుంచుకొని అతనితో సేవలు చేయించుకుంటూ యీ విధంగా కాలం గడుపుతూ వచ్చాడు. కొన్ని దినములు గడచిన తరువాత ప్రధాన్ ను పిలిచి ఒక చిన్న తొట్టె కట్టుమని చెప్పాడు. అది బాబా సమాధి ప్రధానే దానిని మొట్టమొదట కట్టినటువంటివాడు.

1918 వచ్చింది. ఆ సమయంలో ప్రధాన్ భార్య తన గ్రామములో నివసిస్తున్నది. ఆమె కలలో బాబా మరణించినట్లుగా కనుపించింది. ప్రధాన్ షిరిడీలో వుంటున్నాడు. లేచి తన బిడ్డలతో బాబా మరణించినట్లుగా నాకు కలవచ్చింది అని ఏడుస్తూ కూర్చుంది. తక్షణమే తన యింటి నుండి శబ్దము వచ్చింది. బాబా మరణించటమనే శబ్దము వుపయోగించవద్దు. బాబా సమాధిలో వుంటున్నాడనే పదమును వుపయోగించమన్నాడు. సమాధి అనగా సమచిత్తముతో కూడినవాడని అర్థము. జనన మరణములు రెండూ సమానమే. సుఖదుఃఖములు రెండూ సమానమే. లాభనష్టములు రెండూ సమానమే. బాబాకు యీ మరణమనేది లేదు అని శబ్దము వచ్చింది. ఎక్కడో శబ్దము ఎక్కడనుండి యీ శబ్దమని వెతుకుతూ వుండగనే భర్త ఒక కవరు పంపించాడు. బాబా దేహమును వదిలాడని. అది రేపటి దినము. విజయదశమి. సెప్టెంబరు 28వ తేదీ పుట్టినదినము. విజయదశమి దేహాన్ని వదిలిన దినము. ఐతే యీనాడు సెప్టెంబరు 29వ తేదీకి వచ్చింది కానీ పూర్వము దశమి యీ యొక్క తేదీలో రాలేదు. ఇది అక్టోబరులో వచ్చింది పూర్వము. ఈ విధంగా కాలమార్పు చేత బాబా పుట్టిన తిథి కానీ ఎప్పుడు బాబా ఎక్కడ పుట్టినది ఎవ్వరికి తెలియదు. పుట్టుక గురించి కొంచెం రహస్యాన్ని గుర్తించాలి.

పత్రి గ్రామ సముద్భూతం ద్వారకామాయి వాసినం
భక్తాభీష్టప్రదం దేవం సాయినాథం నమామ్యహం

పత్రి గ్రామము లోపల గంగాభవాడ్యుని భార్య దేవగిరమ్మ గౌరి భక్తురాలు. గంగాభవాడ్యుడు ఈశ్వర భక్తుడు. ఈ ఇరువురు పార్వతీ పరమేశ్వరులను నిరంతరము పూజిస్తుండే వారు. కానీ వీరికి బిడ్డలు లేరు. ఈ విధముగా వుండగా వారు జీవితములో మరింత విరక్తి చేత ఈ పార్వతీ పరమేశ్వరుల యొక్క పూజలు మరింత ఎక్కువగా జరుపుతూ వచ్చారు. ఈ గంగాభవాడ్యుడు పడవలు నడుపుకొని కాలము గడుపుతూ వుండేవాడు. వర్షాకాలము కావటం చేత గంగ వుప్పొంగటం చేత గట్టునున్న పడవలు కొట్టుకొని పోతాయేమోనని భార్యతో చెప్పి ఆ నాటి రాత్రి యింటికి రాను పడవలను చూచుకుంటానన్నాడు. సరే భార్య ఏడుగంటలకే భుజించింది. అతనికి భోజనం పెట్టి పంపించింది. తొమ్మిది గంటలైంది. తలుపు కొట్టారు. తిరిగి భర్త యేమైనా వచ్చాడేమోనని ఆతృతతో పోయి తలుపు తెరచింది. ఒక వృద్ధుడు లోపల ప్రవేశించాడు. అమ్మా నాకు బయట చలిగా వుంటున్నది లోపల నాకు కొంత అవకాశము నందించండి అన్నాడు. ఆమె చాలా జత్తమురాలు కనుక వరండా పరుపు తెచ్చి యిచ్చి అక్కడ పండుకోమని చెప్పింది. ఆమె తలుపు వేసుకుని లోపలకు పోయింది. మరి కొంతసేపు అయ్యేటప్పటికి లోపల తలుపు తట్టాడు. తిరిగి తలుపు తెరచింది. అమ్మా! నాకు ఆకలిగా వున్నది యింత అన్నం పెట్టు అన్నాడు. అంతలో ఏమి లేదే పదార్థమని అక్కడా యిక్కడా వెతికి కొంచెం వున్న కూడి తెచ్చి, పెరుగుతో కలిపి యిచ్చింది. తలుపు వేసుకున్నాక మరి కొంచెం సేపటికి తలుపు తట్టాడు. అమ్మా నా కాళ్ళు నొప్పిగా వుంటున్నాయి కొంచెం వత్తుతావా అన్నాడు. మాలీసు చేయమన్నాడు. ఆమె లోపలకు వెళ్ళింది. పూజారూములో కూర్చుంది. తల్లీ ఏమిటి యీ పరీక్ష యీ సమయములో నేను ఏమి చేసేది? అతని సేవ చేసేదా లేక స్త్రీని కదా నేను నిరాకరించుకొని అతనికి విరుద్ధముగా వుండేదా అని చెప్పుకుంటూ యిటువంటి పరిస్థితి తెప్పించావే తల్లీ అని పార్వతిని ప్రార్థిస్తూ వచ్చింది. తిరిగి కొంత కాలము తీసుకొని వెనుక దోవలో పోయి ఇలాంటి సేవ చేసేవారు కొంతమంది వుంటారు వారికి డబ్బు యిచ్చి వారితో సేవ చేయిస్తామని ప్రయత్నించింది. ఎవ్వరూ ఆడా ఆమెకు చిక్కలేదు. ఈ విధంగా వుంటుంటే మరల తలుపు తట్టిన శబ్దమైంది. ఆ సమయానికి వెనుక తలుపునుండి ఒక స్త్రీ వచ్చింది. 'అమ్మా! మీరే మా యింటికి వచ్చారట ఒక ముసలాయన సేవ చేయాలని పిలిచావట. అప్పుడు నేను యింటిలో లేను యిప్పుడు వచ్చాను. ఎవరి సేవ చెయ్యాలి' అంది. అప్పుడు పూజారూములోకి పోయి ప్రార్థించి నా పార్వతీ దేవియే పంపించిందని చాలా ఆనందంగా ఆమెను వరండాలోకి పంపించింది. ఆమె వరండాకు ఆ స్త్రీని పంపించి తలుపు వేసుకుంది. వీరిద్దరు పార్వతీ పరమేశ్వరులు. ఆ వచ్చిన ముసలివాడు ఈశ్వరుడు. వచ్చిన స్త్రీ పార్వతీ దేవి. పార్వతీ యీమె మనోభీష్టములను నెరవేర్చు అన్నాడు ఈశ్వరుడు. పార్వతి ఈశ్వరుని అడిగింది. మీరు పరమేశ్వరులు కదా మీరే అనుగ్రహించండి.

628099009

నేను పరీక్షించటం కోసం వచ్చిన వాడిని నీవు ప్రార్థన విని వచ్చిన దానివి కనుక నీవే ఆవరము నందించుటు అని అన్నాడు ఈశ్వరుడు. తిరిగి తలుపు తట్టారు. ఒక స్త్రీ వుంది కదా అని ఆమె ధైర్యముతో తలుపు తెరచి వచ్చింది బయట ఇద్దరు వురు పార్వతీపరమేశ్వరుల దర్శనం ఇచ్చారు. దేవగిరమ్మ యీ ఆనందమును భరించుకోలేక వారి పాదము లపైన పడింది. అప్పుడు పార్వతి ఆశీర్వదించింది: 'వంశోద్ధారమునకు ఒక కుమారుడు కన్యాదానమునకు ఒక కుమార్తె అనుగ్రహించాను' అంది. అప్పుడు యీమె ఈశ్వరుని పాదాలపై పడింది. 'అమ్మా నీ భక్తికి సంతసించాను మూడవ గర్భములో నేను పుడతాను' అన్నాడు. నమస్కారం చేసి లేచేటప్పటికి యిరువురు లేరు.

ఈ ఆనందములో ఆమె పొంగి పోతూ వుండాది. ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు భర్త వస్తాడా ఎప్పుడు యీ విషయమునంతా వెల్లడి చేతునా అని ఆనందముతో మేలుకొని వుంది పాపం. తెల్లవారేటప్పటికి భర్త వచ్చాడు యింటికి. ఆమె తలుపు దగ్గరనే కాచుకున్నది. రాత్రి జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పింది. ఆయన చెప్పాడు 'దేవగిరి! ఏమిటి యీ పిచ్చి ఏదో కలవచ్చింది నీకు పాపం. పార్వతి ఏమిటి? పరమేశ్వరుడు ఏమిటి! రావటమేమిటి! నీకు దర్శనం ఇవ్వటమేమిటి? అని యీ విధంగా అతను హేళన చేసుకుంటూ వచ్చాడు. ఈమె ఎన్నివిధముల గా బోధించినప్పటికి అతను దీనిని నమ్మలేదు. ఇట్లా కాలము గడుస్తూ వుండగా యీమెకు గర్భం ఏర్పడింది. కుమారుడు పుట్టటం తదుపరి యింకొక సంవత్సరమైన తరువాత కుమార్తె పుట్టటం ఇవన్నీ తాను చూస్తూ వచ్చాడు. పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమవటం నిజమేనని విశ్వసించాడు.

నాకా ప్రాప్తి సంభవించలేదు నీకు యీ ప్రాప్తి సంభవించింది. ఈమెకు మూడవ గర్భము ప్రారంభము కాగానే మాయవలన యితని మనస్సు చాలా మార్పు చెందుతూ వచ్చింది. తపస్సు చెయ్యాలి. ఆ పార్వతీ పరమేశ్వరులను ప్రత్యక్షం చేసుకోవాలి అని ఒక దీక్ష పట్టాడు. ఈమెకు నవమాసములు నిండినాయి. అప్పుడు ఇంతను అరణ్యానికి వెళ్ళి పోతున్నానని చెప్పాడు. అతని వెంటనే పడింది దేవగిరమ్మ. కొంచెము దూరము పోతూనే యీమెకు ప్రసవ వేదన ఎక్కువైపోయింది. అక్కడ ప్రసవించింది. తన చీరగుడ్డలో ఆ పసిబిడ్డను పెట్టింది. యీమె కూడా వెళ్ళిపోయింది. కనుకనే తల్లి తండ్రి ఎవరు అనేది తెలియదు ఎవ్వరికి. ఫకీరుకు కనుపించుట చేత యీ ఫకీరు ఆ బిడ్డను తెచ్చుకున్నాడు. కనుక ఎవరికి పుట్టాడు, ఎప్పుడు పుట్టాడు ఏరీతిగా వుంది అని ఎవరికి తెలియదు. కనుకనే బాబా చరిత్ర అంతా కూడను షిర్డీ వచ్చిన తరువాతనే అందరు తెలుపుతూ వచ్చారు.

(6) కట్టకడపటికి 1917 సంవత్సరము. దామా, దాసుగను, మహాల్సాపతి, చందోర్కరు అందరిని పిలచాడు. ఆ దాసుగను హరికథలు చెప్తుకుంటూ బతికేవాడు పూర్వము. 'హే దాసుగను నేనెవరో తెలుసా! నేనెవరో తెలుసునా?' అడిగాడు. అప్పుడు చెప్పాడు 'నేను తమ శిష్యుణ్ణి' అన్నాడు. నానా నేనెవరో తెలుసా? తమ శిష్యుణ్ణి స్వామి! ఈ విధముగా అందరు కూడను శిష్యులము అన్నారు. ఛీ ఛీ యీ పదమును మీరు వుపయోగించకండి

నాకు శిష్యులు యీ జగత్తులో లేరు. భక్తులు కోట్లమంది వుంటున్నారు. భక్తునికి శిష్యునికి వుండిన భేదాను మీరు గుర్తించటం లేదు. ఎవరైనా భక్తులు కావచ్చు కాని శిష్యుడు మాత్రం కాలేడు. అన్నాడు. శిష్యుడనగా ఎవరు? గురు వాక్య వేదవాక్య' అని గురువు గురించి చెప్పి 'శిష్యస్తే గురు భక్తి ఏవ' భగవంతుని యొక్క ఆజ్ఞ తప్ప నాకు అన్యము లేదు అనేవాడు శిష్యుడు. మీరందరు నా ఆజ్ఞను ఎంత పాటించారు. నా శిష్యులని చెప్పటానికి ఎక్కడుంది మీకు అధికారం!. నీవే తప్ప ఇతః పరంబెరుగ' అనేవాడు శిష్యుడు. నా యొక్క నీడవలె నన్ను వెంటాడుతూ వుండే వాడు నా శిష్యుడు. ఎక్కడైనా వుండి ప్రార్థించేవాడు భక్తుడు. కనుక భక్తునకు శిష్యునకు చాలా భేదా వుంటున్నాది. శిష్యుడనగా రెండు దేహములు ఒక్క ప్రాణము. నీవు వేరు నేను వేరు అనే భావము వుండకూడదు. I and you we are ఇది ఒక్కటిగా రావాలి. కానీ అలాంటి వారు జగత్తులో కనుపించటం లేదు. లోకములో కోటాను కోట్ల మంది భక్తులుంటున్నారు. శిష్యులు లేరు అన్నాడు. అప్పుడు శ్యాం చాలా బాధపడ్డాడు. నీ పదసేవ తప్ప నాకు అన్యము లేదు కదా. తరువాత ఆ సీటునుండి లోపలకు వెళ్ళాడు బాబా. శ్యామును ప్రత్యేకంగా పిలిచాడు. నాకు యీ జగత్తులో నీ వొక్కడవే శిష్యుడవు. అందరు భక్తులే. అప్పుడే పాదాలు పట్టుకొని శ్యాం 'నీవే తప్ప నీవే తప్ప' అనుకుంటూ ప్రాణమును వదిలాడు. బాబా తన యొక్క జీవితములో 82 సంవత్సరములు వుండినటువంటి వాడు. ఈ 82 సంవత్సరముల లోపల ఒక్కనాడైనా ప్రజలు చూడంగా కంటినుండి ఒక చుక్క నీరు విడిచినవాడు కాదు. శ్యాం పోయినప్పుడు మాత్రం మూడు చుక్కలు మాత్రం నీరు వదిలాడు. అప్పుడు వుండిన భక్తులందరు ఏమిటి మీరు విచారించటం. సర్వము మీ చేతిలో వుంది కదా మీరు ఎందుకింత విచారిస్తున్నారు' అన్నారు. 'పిచ్చివాడా నేను దుఃఖించటం కాదు అతను చేసిన పాపం పరిహారమైంది యింకా కొంచెం వుండటం చేత నా యొక్క యీ మూడు చుక్కలతో దాన్ని కూడను తుడిచి వేస్తున్నాను' అన్నాడు. బాబా చేసిన ప్రతి పని గాని, మాట గాని, ప్రతి దృష్టిగాని అన్నీ భక్తులను ఉద్ధరించే కోసమే తప్ప అన్యము కాదు.

కట్టకడపటికి అబ్దుల్లా కూడను దగ్గరకు చేరాడు. తిరిగి నేను వస్తాను దర్శనము యిస్తానన్నాడు. అది ఎప్పుడు అని అబ్దుల్ అడుగగా ఆరేళ్ళని నుడివె కదా! ఎప్పుడు స్వామి అన్నాడు. ఆరేళ్ళ తరువాత నే వస్తానన్నాడు. మొదటి అవతారము మహారాష్ట్రము. రెండవది మద్రాసు రాష్ట్రము. ఈ దేహము పుట్టినప్పుడు ఆంధ్రప్రదేశ్ మద్రాసు రాష్ట్రము లో వుండేది. 'అప్పుడు ఏ విధంగా మాకు దర్శనమిస్తారు?' అన్నాడు. అప్పుడు అబ్దుల్ కు మాత్రమే తాను చెప్పివుండినాడు. 'సత్య పేరుతో నీకు లభ్యమవుతుంది' అన్నాడు. అదే యిప్పుడు కావటం. దేహములు రెండుగాని దివ్యత్వము ఒకటే. ఏతే ఒకటి మాత్రము దివ్యత్వాన్ని తెలిపించే కోసం. ఇక్కడ దివ్యత్వాన్ని అందించే కోసం. రాబోయేది దివ్యత్వాన్ని బోధించే కోసం. అదే షిరిడిసాయి, సత్యసాయి ప్రేమసాయి.

ఈనాడు యీ విషయమును గురించి మీకు చెప్పటంలో కారణం ఏమంటే సెప్టెంబరు 28

వ తేదీ పుట్టిన దినము. 1835 సంవత్సరము సెప్టెంబరు 28వ తేదీ పుట్టిన దినము. శరీరమును వదలిన సంవత్సరము 1918. దేహములు నీటి బుడగల వంటివే. దేహముల ధరించేది భక్తోద్ధరణ కోసమే! సాకారము లేకుండా నిరాకారమును ఎవ్వరు కూడా విశ్వసించలేరు. సాకారమే నిరాకారమునకు పునాది. కనుక భగవంతుని యొక్క తత్త్వము ఎవరు అర్థము చేసుకోటానికి వీలుకాదు. సగుణ నిర్గుణములతో వుంటుంటాడు. అణువుగా ఘనముగా వుంటుంటాడు. ఏది అణువో ఏది ఘనమో ఎవ్వరు సత్తించలేరు. ఏది సగుణమో ఏది నిర్గుణమో ఎవ్వరూ భావించలేరు.

నిను కనుగొన గలరా కృష్ణా నిను కనుగొన గలరా!
అణువు కంటె అతి సూక్ష్మ రూపుడవు
ఘనము కంటె అతి గరిమయుడవు.
ఎనుబది నాలుగు లక్షల జీవముల
అనయమ్మును వెడబాయక యుందువట
అణు రేణువు తృణ కాష్ఠము మొదలుగ
అఖండ రూపుడవై వెలయుదువట
ఘనమగు దొంగలలో గజదొంగవు. ॥నిను॥

ఈ దొంగలంతా సిరిసంపదలను దోచుకొని పోతారు. ధనకనక వస్తు వాహనాదులు దోచుకొని పోతారు. కాని ఈ గజదొంగ హృదయాన్నే దోచుకుంటాడు. కనుక భగవంతుని చిత్తచోరా, బడా చిత్తచోర అన్నా కూడను ఆనందమే గాని కోపము రాదు. ఎవరైనా దొంగ అంటే మనకు కోపం వస్తుంది. కాని ప్రేమతో 'చిత్తచోరా' ముద్దొకె చోర్! నవనీత చోర గోపాల్ అంటే ఆనందంగా నవ్వుతారు. ఈ చిత్తచోరుని లో ఆనందం పుట్టిపడుతుంది. కాబట్టి చిత్తచోరుడు కూడను ఆనందమునే అందించేవాడు. విత్త చోరుడు దుఃఖాన్ని అందించేవాడు. లోకులు విత్తచోరులు. భగవంతుడు చిత్తచోరుడు. భగవంతుని తత్త్వము ఎవరు అర్థం చేసుకోటం కష్టము. కనుక అర్థము చేసుకోటానికి వీలుకానప్పుడు వూరకే వుండటం మంచిదిగాని అనర్థాలు మాత్రం పలికించకండి. కనుక అర్థము చేసుకోటానికి ప్రయత్నించి ఆరాధనల చేతను, భజనల చేతను భగవంతుని దివ్యత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించండి.

1990 సెప్టెంబరు 28వ తేదీ శుక్రవారం ప్రశాంతినిలయ మందిరంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం.

గమనిక.. శిరిడీసాయిబాబా జన్మదినము 28-09-1836 అని స్వామి శ్రీ నరసింహంగారితో చెప్పిరి.